క్లుప్తంగా

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన శరగడం


సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిన అప్పలనాయుడు

సింహాచలం: విశాఖ శ్రీశారదాపీఠం వార్షికోత్సవాలకు మంగళవారం వచ్చిన వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని ఆ పార్టీ పశ్చిమ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు శరగడం చిన అప్పలనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట నాయకులు అవగడ్డ స్వామి నాయుడు, బొట్ట రవికుమార్, వంకిరెడ్డి అప్పలనాయుడు, ఎర్ర అప్పలరాజు, లాలం అప్పల నాయుడు ఉన్నారు.

నేడు ధర్మశాస్త విగ్రహ ప్రతిష్ట


అయ్యప్పస్వామి దేవాలయం

సింహాచలం: సుజాతనగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం పూర్ణ పుష్కల సమేత శ్రీహరిపుత్రుడు(ధర్మశాస్త) విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నట్టు అయ్యప్ప సేవా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో భక్తులంతా పాల్గొని స్వామివారి అనుగ్రహం పొందాలని కోరారు.

సుబ్రహ్మణ్యుడికి ప్రత్యేక పూజలు


సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువైన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

మహిళ అదృశ్యం


కనకమహాలక్ష్మి

సింహాచలం: మహిళ అదృశ్యంపై పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు...పెందుర్తి దరి చినముషిడివాడ బీసీకాలనీలో నివాసం ఉంటున్న కె. కనకమహాలక్ష్మి(50) ఆర్థిక ఇబ్బందులతో ఇంట్లో నుంచి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆమె ఆచూకీ దొరకలేదు. కనకమహాలక్ష్మి కుమారుడు కె.సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ బి.అప్పారావు తెలిపారు.

టన్నెల్ అక్వేరియంను సందర్శించిన వీసీలు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీస్, ఏయూ సౌజన్యంతో నిర్వహిస్తున్న సదస్సుకు హాజరైన దక్షిణ భారత విశ్వవిద్యాలయాల ఉప కులపతులు(వీసీలు) మంగళవారం రాత్రి ఏయూ హైస్కూల్ మైదానంలో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అండర్ వాటర్ టన్నెల్ ఫిష్ అక్వేరియంను తిలకించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏయూ కార్యదర్శి పంకజ్ మిట్టల్, ఉపాధ్యక్షుడు జి.డి.శర్మ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ కార్యదర్శి పంకజ్ మిట్టల్ మాట్లాడుతూ పర్యాటకంగా విశాఖ నగరం అద్భుతంగా ఉందన్నారు. బీచ్ రోడ్డులో సబ్‌మెరైన్ మ్యూజియం, యుద్ధ విమాన మ్యూజియం, వీటికి తోడుగా టన్నెల్ ఫిష్ అక్వేరియం పర్యాటకులకు ఎంతో సంతృప్తిని ఇస్తాయన్నారు.

కల్యాణం.. కమనీయం


కంకణధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకుడు


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


గరుడసేవ నిర్వహిస్తున్న పురోహిత్ సీతారామాచార్యులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్ఠంపజేశారు. ఉదయం 9.30 గంటల నుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈసేవ నిర్వహించారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తి గోవింద రాజస్వామిని గరుడవాహనంపై అధిష్ఠంపజేసి అష్టోత్తరశతనామావళి పూజ చేసి హారతులు అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు. ఆలయ పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు ఈసేవ నిర్వహించారు.

వెంకన్న వార్షిక కల్యాణోత్సవాలకు అంకురార్పణ


వెంకన్న ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

సింహాచలం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానానికి చెందిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక కల్యాణోత్సవాలకు మంగళవారం రాత్రి అంకురార్పణ చేశారు. పాంచరాత్ర ఆగమశాస్త్రం ప్రకారం అర్చకులు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. దేవస్థానం పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు,అర్చకులు శ్రీకాంత్, వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం సాయంత్రం గ్రామ తిరువీధి, రాత్రి 7గంటల నుంచి స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు.

అనకాపల్లి జేసీ దాతృత్వం


సబ్బవరం పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న గవర శారద

సబ్బవరం: అనకాపల్లి–ఆనందపురం జాతీయ రహదారిపై రేబాక వద్ద ద్విచక్రవాహనం అదుపు తప్పడంతో గాయపడిన మహిళను జిల్లా సంయుక్త కలెక్టర్ కల్పనా కుమారి తన కారులో సబ్బవరం పీహెచ్‌సీకి తరలించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. సబ్బవరం మండలంలోని టెక్కలిపాలెం శివారు నాయనమ్మపాలేనికి చెందిన గవర శారద తన భర్త గంగరాజుతో కలిసి అనకాపల్లి మండలంలోని శంకరంలో జరిగిన వీరాంజనేయస్వామి తీర్థానికి ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి మంగళవారం రాత్రి స్వగ్రామం వస్తుండగా రేబాక సమీపంలో స్పీడ్ బ్రేకర్ ఎక్కిస్తుండగా ద్విచక్రవాహనం అదుపుతప్పింది. దీంతో జారిపడిన గవర శారదకు గాయాలు అయ్యాయి. ఆ సమయంలో అటుగా సబ్బవరం వైపు వెళ్తున్న జేసీ తన కారులో సబ్బవరం పీహెచ్‌సీకి తరలించారు.అక్కడ వైద్యులకు ఫోన్‌చేసి దగ్గర ఉండి వైద్యం చేయించారు. అవసరం అయితే తనకు ఫోన్ చేయాలని వారికి నెంబర్ ఇచ్చిఅనంతరం అక్కడ నుండి బయలుదేరి వెళ్లిపోయారు.

రెండు ఆటోలు ఢీ

- ఐదుగురు విద్యార్థులకు గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ విద్యార్థిని సరస్వతి

సబ్బవరం: మండలంలోని సబ్బవరం నుంచి వంగలి వెళ్తున్న రోడ్డులో మంగళవారం ఎదురెదురుగా రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని వంగలి గ్రామానికి చెందిన సరస్వతి,గవర రమాదేవి,మాటూరి ప్రవల్లిక,కోన వెన్నెల,గవర సాగర తదితరులు సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్నారు. వీరంతా కళాశాల ముగిసిన తర్వాత సాయంత్రం 5 గంటల సమయంలో వంగలి ఆటోలో వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో ఆటో టి. జంగాలపాలెం సమీపంలోని ఇటుకుల బట్టీ వద్ద ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రెండు ఆటోలు బోల్తా పడ్డాయి. ఈ ఘటనలో కోన సరస్వతికి రెండు కాళ్లు విరిగిపోగా,కోన వెన్నెలకు నడుముకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌ఎంపీల జోనల్ కార్యదర్శి గణేష్‌కు అభినందన



సింహాచలం: ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జోనల్ కార్యదర్శిగా సింహాచలంకి చెందిన లోగిశ గణేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గోపాలపట్నంలో జరిగిన ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం విస్తృత స్థాయి సమావేశంలో గణేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ, పెంపా రాష్ట్ర సలహాదారు ఎస్.ఎల్.రావు, బెహరా హాస్పటల్స్ ఎండీ బెహరా రవితేజ చేతుల మీదుగా గణేష్ ధ్రువీకరణ పత్రం అందుకున్నారు. విశాఖ జిల్లా అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్, కార్యదర్శి కడగల నారాయణరావు, కోశాధికారి కృష్ణ తదితరులు గణేష్‌ను అభినందించారు. అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న గణేష్ తూర్పుకాపు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై అవగాహన ర్యాలీ


అవహగాన ర్యాలీలో పాల్గొన్న టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐవీ రమణమూర్తి తదితరులు

కంచరపాలెం: కంచరపాలెం కూడలిలో జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ నేతృత్వంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు, సచివాలయ సిబ్బంది మంగళవారం ఫుట్‌పాత్ ఆక్రమణలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జోన్–5 టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఐవీ రమణమూర్తి అవగాహన ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురి కావడంతో పాదచారులు ఇబ్బంది పడడం, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. ప్రమాదాలకు కూడా ఫుట్‌పాత్ ఆక్రమణలు కారణమవుతున్నాయని అన్నారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించినా, వాహనాలు నిలిపినా, వ్యాపారాలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలపై సచివాలయ సిబ్బంది పర్యవేక్షించాలని ఆయన ఆదేశించారు. కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ వంతెన నుంచి ఊర్వశి కూడలి వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఫుట్‌పాత్‌లను ఆక్రమించుకుని ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించారు.

మహా చండీ ఉత్సవాలకు ఏర్పాట్లు


మాట్లాడుతున్న కందర్ప రమా తదితరులు

నేటి నుంచి పూజలు ప్రారంభం


దక్షవాటిలో సిద్ధంగా ఉన్న 116 కలశాలు

సబ్బవరం: దేవీపురంలోని శ్రీ సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో ఈ నెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకూ నిర్వహించే మహా చండీ ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేశారు. పీఠాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి పీఠం ఆధ్వర్యంలో అన్నపూర్ణమ్మ సహిత అమృతానంద సరస్వతి ఆశీస్సులతో ఈ నెల 4వ తేదీన సహస్ర చండీ యాగం నిర్వహించనున్నట్లు శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా తెలిపారు. దేవీపురంలో మంగళవారం ఆమె ఉత్సవాల వివరాలను వెల్లడించారు. 1వ తేదీన దుర్గా సప్తశతి, 5న మాఘ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక కలశాభిషేకం, అభిషేకాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కెనడాకు చెందిన రమేష్ నటరాజన్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు జరుగుతాయన్నారు. ఆయన గతంలో అమృతానంద స్వామి వద్ద శ్రీవిద్య అభ్యసించినట్లు తెలిపారు.ఈ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమంలో కందర్ప ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సరికొత్త చరిత్రకు నాంది ఉక్కు ఉద్యమం

కూర్మన్నపాలెం: దేశంలో సరికొత్త చరిత్రకు విశాఖ ఉక్కు ఉద్యమం నాంది పలకనుందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. కార్మిక వర్గం తప్పక విజయం సాధిస్తుందన్నారు. ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 719వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో ఈఎస్‌ఎఫ్, ఈఆర్‌సీ, సేఫ్టీ, టెక్ సెల్ తదితర విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు, జె.రామకృష్ణ, డి.శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని పదే పదే ప్రకటనలు చేయడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించాలని దేశ ప్రజలు, కార్మికవర్గం, మరీ ముఖ్యంగా సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారన్నారు. కనుక కేంద్ర ప్రభుత్వం పదే పదే చేసే ప్రకటనలతో బెదిరేది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా ఉక్కు ప్రజాగర్జనను విజయవంతం చేసిన ఉక్కు కార్మికులు, నిర్వాసితులకు, అఖిలపక్ష రాజకీయ పార్టీ నాయకులు, మేధావులు, స్థానికులకు కృతజ్ఞతలు తెలిపారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

2న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఫిబ్రవరి 2న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలికలు

అల్లిపురం: స్కూలుకు వెళ్లిన ఇద్దరు బాలికలు తప్పిపోయిన ఘటనలో పోలీసులు చొరవ తీసుకుని వారిని వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. జగదాంబ జంక్షన్‌లోని సెవెంత్ డే అడ్వాంటిస్ట్ స్కూల్లో 7,9 తరగతులకు చెందిన ఇద్దరు బాలికలు సోమవారం సాయంత్రం ఇంటికి చేరుకోలేదని వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నగర పోలీసులు అప్రమత్తమయ్యారు. డీసీపీ పర్యవేక్షణలో ఈస్ట్ ఏసీపీ, మహారాణిపేట సీఐ, ఎస్‌ఐలు రంగంలోకి దిగి సీసీ కెమెరాల ద్వారా శోధించారు. రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, బీచ్‌రోడ్డు, పూర్ణామార్కెట్, డాల్ఫిన్ రూట్, జగదాంబ జంక్షన్ తదితర ప్రాంతాల్లో గాలించి సీసీ పుటేజీల ఆధారంగా బాలికలను గుర్తించారు. బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో వారు ఆనందం వ్యక్తం చేశారు.

జాతీయ మహిళా కమిషన్ సదస్సుకు గెడ్డం ఉమ


జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ రేఖా శర్మతో రాష్ట్ర కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ

పరవాడ: జాతీయ మహిళా కమిషన్ ఏర్పాటై 31 ఏళ్లు పూర్తి చేసుకున్న నేపథ్యంలో కమిషన్ చైర్మన్ రేఖాశర్మ ఆధ్వర్యంలో ఢిల్లీలోని విజ్ఞాన భవన్‌లో మంగళవారం జరిగిన ప్లీనరీలో దేశంలో అన్ని రాష్ట్రాల చైర్మన్‌లు, సభ్యులు పాల్గొన్నారు. ఆ సమావేశంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు గెడ్డం ఉమ ఇతర సభ్యులు పాల్గొన్నారు. వెనుకబడిన తరగతుల నుంచి వచ్చిన తనకు దేశ ప్రథమ పౌరురాలు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో వేదిక పంచుకునే గొప్ప అవకాశం కల్పించారని ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రేపు గ్రహణ మొర్రి, గ్రహణశూల బాధితులకు స్క్రీనింగ్ క్యాంపు

సింహాచలం: పెందుర్తి భవిత కేంద్రంలో గురువారం గ్రహణం మొర్రి, గ్రహణశూల విద్యార్థులకు స్క్రీనింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు విశాఖ జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త ఎ .అబ్దుల్లా ఆశ మంగళవారం తెలిపారు. ప్రభుత్వ సమగ్రశిక్ష , బసవతారకం స్మైల్ ట్రిన్స్ సెంటర్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. ఆరోజు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5గంటల వరకు క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. అవసరమైనవారికి హైదరాబాద్‌లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయడం జరుగుతుందన్నారు. అలాగే వారికి అవసరమైన ట్రాన్స్‌పోర్టు అలవెన్సులుకూడా ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. అలాగే విశాఖపట్నం జిల్లాలో ఉన్న ప్రత్యేక ఉపాధ్యాయులు కూడా గ్రహణం మొర్రి, గ్రహణశూలతో బాధపడుతున్న విద్యార్థులను గుర్తించి ఈసమాచారాన్ని వారి తల్లిదండ్రులకు అందించాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- డీఎస్పీ శ్రీనివాసరావు


సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పరవాడ: వాహన చోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడతారని అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని ఫార్మాసిటీలోని ఎం.ఎ.ఎస్. ఆర్.ఎం కార్యాలయం వద్ద వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రతీ వాహనదారుడు హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉంచుకోవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెట్టి సుబ్బారావు, పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, ఫార్మా పరిశ్రమల వాహనచోదకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

రక్షిత్ ఫార్మా పరిశ్రమలో రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో రక్షిత్ ఫార్మా ఆధ్వర్యంలో మంగళవారం పరిశ్రమ ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో ఇండస్ ఆస్పత్రి వైద్యులతో గుండెకు సంబంధించిన అన్ని రకాల వైద్య పరీక్షలు జరిపారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన రక్షిత్ గ్రూప్ సంస్థల చైర్మన్ రామేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రత్యేకమైన జాగ్రత్తలు పాటించాలని ఉద్యోగులకు సూచించారు. కష్టపడి పని చేసిన ఉద్యోగులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందన్నారు. 20 మంది ఉద్యోగులకు ఆర్థిక సహాయంతో పాటుగా కళ్లద్దాలు అందజేశారు. చైర్మన్ రామేశ్వరరావు దంపతులను సంస్థ జీఎం దొరబాబు, నాలుగు సంస్థల హెడ్‌లు, ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. రక్తదాన శిబిరంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి సత్కారం


చిరంజీవిరావును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్ర విభాగంలో అధ్యాపకుడి పనిచేస్తున్న డాక్టర్ వేపాడ చిరంజీవిరావు మంగళవారం స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. శంకర్ మిగిలిన అధ్యాపకులతో కలిసి మంగళవారం కళాశాలలో ఘనంగా సత్కరించారు. ఇంకా 12 సంవత్సరాలు సర్వీసు ఉండగా స్వచ్ఛందంగా విరమణ చేయడం విద్యార్థులకు తీరని లోటని ప్రిన్సిపాల్ అన్నారు.

చిరంజీవిరావు ప్రస్థానం ఇదీ

చిరంజీవిరావు రావికమతం మండలం దొండపూడిలోని సాధారణ కుటుంబంలో జన్మించారు. తల్లిదండ్రుల ఆదరణతో పాఠశాల విద్య అభ్యసించారు. కొత్తకోట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్, చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ అనంతరం ఆంధ్రా యూనివర్సిటీలో ఎంఏ చదివి అన్ని చోట్ల టాపర్‌గా నిలిచారు. అదేవిధంగా ఉపాధ్యాయ శిక్షణ పొంది 1996లో నిర్వహించిన డీఎస్సీ(ఎస్‌జీటీ)లో విశాఖ జిల్లా టాపర్‌గా నిలిచారు. 1998లో స్కూల్ అసిస్టెంట్‌గా మళ్లీ జిల్లా టాపర్‌గా నిలిచారు. అదేవిధంగా 2002లో ఏపీపీఎస్సీ నిర్వహించిన జూనియర్ కళాశాల లెక్చరర్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో సత్తాచాటారు. అప్పటి నుంచి అర్థశాస్త్ర సబ్జెక్టులో బోధించి అనేక మంది వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు ఎదగడంలో చిరంజీవిరావు ప్రధాన పాత్ర పోషించారు.

నేడు వైభవునికి తులసీ దళార్చన

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో కొలువుదీరిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా బుధవారం తులసీ దళార్చన నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. స్వామికి ఉదయం నిర్వహించే ప్రత్యేక పూజలు అనంతరం 9 గంటలకు తులసీ దళార్చన, తరువాత సామూహిక విష్ణుసహస్ర నామార్చన ఉంటుందని పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం దగ్ధం


మంటల్లో కాలుతున్న ద్విచక్ర వాహనం

ఆరిలోవ: రహదారిపై ప్రయాణిస్తుండగా ఓ ద్విచక్ర వాహనం దగ్ధమైంది. బీఆర్‌టీఎస్ రోడ్డులో ముడసర్లోవ వద్ద జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ఆరిలోవ ప్రాంతం నుంచి ఇద్దరు వ్యక్తులు హోండా యాక్టివ్‌పై పైనాపిల్ కాలనీ వెళ్తున్నారు. ముడసర్లోవ రిజర్వాయరు దాటి విశాఖ కేంద్ర కారాగారం సమీపానికి వెళ్లేసరికి బైక్ వెనక భాగంలో చిన్నగా మంటలు వచ్చాయి. వారి వెనక ప్రయాణించేవారు మంటలు గమనించి వాహనచోదకుడికి చెప్పారు. వెంటనే వారు రామకృష్ణాపురం ఎదురుగా వాహనం నిలిపి దూరంగా పారిపోయారు. సుమారు 10 నిమిషాలలో ఆ వాహనం నుంచి పెద్దగా మంటలు చెలరేగి పూర్తిగా కాలిపోయింది. వాహనంలో ఎలక్ట్రికల్ వైర్లు కలిసిపోయి షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించి ఉంటాయని పలువురు భావిస్తున్నారు. బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరూ దూరంగా పారిపోవడంతో ప్రాణాపాయం తప్పింది.